## క్లుప్తంగా

### పెండింగ్ వేతనాలు విడుదల చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న సమ్మయ్య

శంకరపట్నం: మధ్యాహ్న భోజనం నిర్వాహకులకు పెండింగ్ వేతనాలు ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి టేకుమల్ల సమ్మయ్య డిమాండ్ చేశారు. మండలంలోని కేశవపట్నంలో శనివారం మధ్యాహ్న భోజన నిర్వాహకుల సమావేశం నిర్వహించారు. నవంబర్ నుంచి వేతనాలు చెల్లించకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని పేర్కొన్నారు. మూడువేలకు వేతనం పెంచుతున్నామని ప్రభుత్వం విడుదల చేసిన జీవోను అమలు చేయాలని, కూరగాయలు, కోడిగుడ్ల బిల్లలు చెల్లించాలన్నారు. సమావేశంలో జిల్లా సహాయకార్యదర్శి పిట్టల సమ్మయ్య, మధ్యాహ్న భోజనం నిర్వాహకుల కమిటీ జిల్లా అధ్యక్షుడు బొజ్జ సాయిలు, రజిత, సైనాబేగం, హాలియా, నాగమ్మ, పద్మ, సారమ్మ, తదితరులు పాల్గొన్నారు.

### దత్తత గ్రామంలో ఇబ్బందులు

మానకొండూర్: మండలంలోని ఈదులగట్టెపల్లి గ్రామంలో శనివారం బీజేపీ శక్తి కేంద్రం స్ట్రీట్ కార్నర్ మీటింగ్ నిర్వహించారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు, మండల ఇన్‌చార్జి మాడ వెంకటరెడ్డి మాట్లాడారు. ప్రధాని నరేంద్ర మోదీ అన్నివర్గాల సంక్షేమానికి కృషి చేస్తున్నారని, కరోనా కష్టకాలంలో పేదలకు ఉచిత రేషన్ అందించారని అన్నారు. ఈదులగట్టెపల్లి గ్రామాన్ని ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ దత్తత తీసుకుని అభివృద్ధి మాత్రం చేయడం లేదని ఆరోపించారు. గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద మత్తడి నీరు పొంగుతున్నా పట్టించుకోవడంలేదని వాపోయారు. డబుల్ బెడ్రూం ఇళ్ల కోసం ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు తిరుపతి, శ్రీనివాస్, బీజేపీ మండల కార్యదర్శి కార్తీక్, శేఖర్, శ్రీనివాస్, పవన్, అనిల్, శంకర్, రాజయ్య,కొంరయ్య ఉన్నారు.

### బొమ్మనపల్లిలో సీసీరోడ్డు పనులు ప్రారంభం



చిగురుమామిడి: మండలంలోని బొమ్మనపల్లి గ్రామం ఏడు, ఎనిమిదో వార్డుల్లో సీసీరోడ్డు పనులను శనివారం సర్పంచ్ కానుగంటి భూంరెడ్డి ప్రారంభించారు. హుస్నాబాద్ ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్ గ్రాంటు నుంచి మంజూరైన పది లక్షలతో పనులు చపడుతున్నామని సర్పంచ్ తెలిపారు. ఎంపీటీసీ మల్లేశం, ఉపసర్పంచ్ శారదసదానందం, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

### క్యాలెండర్ ఆవిష్కరణ

విద్యానగర్: బహుజన ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర, జిల్లా శాఖల ఆధ్వర్యంలో ముద్రించిన 2023 క్యాలెండర్‌ను శనివారం కరీంనగర్ ప్రెస్‌భవన్‌లో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొమ్ము రమేష్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 317 జీవోతో జిల్లాల స్థానికత కోల్పోయిన ఉపాధ్యాయులకు మరో అవకాశం ఇవ్వాలని డిమాండ్ చేశారు.జిల్లా అధ్యక్షుడు రాజయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షులు సుధీర్, రమేష్, గౌరవ సలహాదారు చిలుక దేవశంకర్, జిల్లా ప్రధాన కార్యదర్శి జంగం అంజన్‌బాబు, నాయకులు మల్లేశం, రాజు, దేవదాస్, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

### ముగిసిన టాస్క్ శిక్షణ

శాతవాహనయూనివర్సిటీ: నగరంలోని వివేకానంద డిగ్రీ, పీజీ కళాశాలలో తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ (టాస్క్) ఆధ్వర్యంలో ఫండమెంటల్స్ ఆఫ్ అకౌంటింగ్‌పై మూడు రోజులపాటు జరిగిన శిక్షణ కార్యక్రమం శనివారం ముగిసింది. ముఖ్య అతిథిగా ప్రిన్సిపాల్ డాక్టర్ సిహెచ్.శ్రీనివాస్ హాజరై మాట్లాడారు. పోటీ ప్రపంచంలో అకౌంటింగ్ ఆవశ్యకత ఎనలేనిదని, కంప్యూటర్ పరిజ్ఞానంతో అకౌంటింగ్ ప్రాముఖ్యత గల ఉపాధి అవకాశాలు పెరిగాయని, విద్యార్థులు సద్వి నియోగం చేసుకోవాలని సూచించారు. కంపెనీ క్రియేషన్, లెడ్జర్ క్రియేషన్, జీఎస్టీ, రిపోర్ట్స్ తదితర అంశాల గురించి శిక్షణ అందించారు. కార్యక్రమంలో బి.సంపత్‌కుమార్, శ్రవణ్‌కుమార్, జస్వంత్‌సింగ్, రామేశ్వరరావు ఉన్నారు.

# మెష్ డోర్స్..

సండే స్పెషల్

- పల్లె, పట్టణాల్లో పెరుగుతున్న వినియోగం
- దోమ తెరలకు రాంరాం
- తక్కువ ధరల్లో లభ్యం

చొప్పదండి: వర్షాకాలంతో పాటు చలికాలంలో దోమల నివారణకు పట్టణంతో పాటు పల్లెవాసులు పడే అవసోపాలు వర్ణనాతీతం. చేతిలో దోమల బ్యాట్ పట్టుకొని కూర్చున్నా, వరండాలో ఫ్యాన్ వేసుకొని సేద తీరినా, పొద్దున లేచింది మొదలు రాత్రి పడుకునే వరకు ఇల్లు, కార్యాలయాల్లో దోమలతో ప్రజలు ఇబ్బంది పడుతూనే ఉన్నారు. మారుతున్న కాలం, పెరుగుతున్న టెక్నాలజీతో ఇప్పుడు దోమల నివారణకు మెష్ డోర్‌ల వినియోగం పెరిగిపోతోంది. అందమైన ఇంటి నిర్మాణానికి ఎంత ప్రాముఖ్యం ఇస్తున్నారో ఇంట్లోకి దోమలు రాకుండా చూసుకోవడంపై కూడా అంతే శ్రద్ధ వహిస్తున్నారు. దీంతో రూ. లక్షలు వెచ్చించి కొనుగోలు చేసిన టేకు కర్ర దర్వాజను దోమల నివారణకు ఉపయోగించే మెష్ డోర్ ఫ్రేంలు కప్పేసే స్థాయికి వచ్చింది.



మెష్‌డోర్ తయారు చేస్తున్న అమ్మకందారులు

#### అందుబాటులో రెండు రకాలు



ఇంట్లోకి ప్రవేశించే ప్రధాన గుమ్మంతో పాటు, ఇంటి బయట వైపు ఉండే అన్ని దర్వాజలకు మెష్ డోర్‌లను యజమానులు బిగిస్తున్నారు. సింగిల్‌తో పాటు డబుల్ డోర్‌లను కూడా తయారీ చేస్తున్నారు. ద్వారం బయటవైపు బిగిస్తూ దోమల జారిన పడకుండా ఉంటున్నారు. వీటితో పాటు డ్రిల్ విధానంతో మెష్ డోర్‌లను తయారు చేస్తున్నారు. ప్రధాన ద్వారం కర్రకు పైభాగంలో బిగిస్తున్నారు. అల్యూమీనియం కిటికీలకు కూడా డిమాండ్ పెరుగుతోంది. టేకు కర్రతో చేసిన మాదిరిగా రెక్కలను తయారు చేస్తుండగా స్లైడింగ్ రెక్కలు కూడా అందుబాటులోకి వచ్చాయి. ఈ స్లైడింగ్ డోర్‌లలో టూట్రాక్, త్రీట్రాక్ అనే రెండు రకాల డోర్‌లు లభిస్తున్నాయి.

#### పెరుగుతున్న గిరాకీ



టేకు కర్రకు రోజురోజుకు ధరలు పెరుగుతుండటంతో మెష్ డోర్‌ల తయారీకి అల్యూమీనియం ఉపయోగించడం పెరిగింది. దర్వాజ చేరానికి రెండు వైపులా డోర్‌లు బిగించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. దర్వాజ మెష్ డోర్‌కు సింగిల్ రూ. 3 వేల వరకు, డబుల్ రెక్కలు రూ. 4 వేల వరకు లభిస్తున్నాయి. డ్రిల్ విధానంలో సింగిల్ డోర్ రూ. 6,500, డబల్ డోర్ రూ. 7,500 వరకు అందుబాటులో ఉన్నాయి. కిటికీల రెక్కల తయారీకి ఒక్కో చదరపు అడుగుకు రూ. 1,200 ధర ఉండగా, స్లైడింగ్ డోర్‌లలో టూట్రాక్‌కు చదరపు అడుగుకు రూ. 330, త్రీట్రాక్‌కు రూ. 400 ధర ఉంది.

#### వినియోగం పెరుగుతోంది



అల్యూమీనియం డోర్‌ల వినియోగం పెరుగుతోంది. మెష్ డోర్‌ల వినియోగం నూతన గృహాలకు తప్పనిసరిగా మారింది. సంవత్సరాలు గడిచినా చిలుము రాక పోవడం, పుచ్చు లేవక పోవడం, వాటర్ ప్రూఫ్ వంటి డోర్‌లకు డిమాండ్ ఉంది. టేకుతో పోల్చుకుంటే ధరలు తక్కువగా ఉన్నాయి.

– కె.శ్రీనివాస్, షాపు యజమాని చొప్పదండి

## సమాచారం

### దుకాణాల నిర్వహణకు వేలం

మానకొండూర్: తిమ్మాపూర్ మండలం నల్లగొండ గ్రామంలో హోలీ సందర్భంగా నిర్వహించే శ్రీసీతారామ, లక్ష్మీనసింహస్వామి జాతరలో వివిధ దుకాణాల నిర్వహణకు సీల్డు టెండర్, బహిరంగం వేలం కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ఆలయ ఈవో ఉడుతల వెంకన్న, ఆలయ చైర్మన్ దన్నమనేని శ్రీనివాసరావు తెలిపారు. 15న ఉదయం 11 గంటలకు ఆలయ ప్రాంగణంలో వేలం నిర్వహిస్తామని, కొబ్బరికాయలు, లడ్డూ, పులిహోర విక్రయానికి రూ.50 వేలు, పేలాలు, పుట్నాల విక్రయం, కొబ్బరి ముక్కల సేకరణకు రూ.10 వేల కనీస ధర నిర్ణయించామని వివరించారు. 26 నుంచి మార్చి 12వ తేదీ వరకు మాత్రమే హక్కులు వర్తిస్తాయని తెలిపారు. ఆసక్తిగలవారు ప్రతి వేలంకు దరావత్తు, షెడ్యూల్ ఫారం రూ.100 చెల్లించి వేలంలో పాల్గొనాలని సూచించారు.

### ఓటరు కార్డుకు ఆధార్ లింక్

కరీంనగర్‌రూరల్: మండలంలోని బొమ్మకల్, తీగలగుట్టపల్లిలో రెవెన్యూశాఖ ఆధ్వర్యంలో శనివారం ఓటరు కార్డుకు ఆధార్‌లింక్ కార్యక్రమాన్ని చేపట్టారు. ఆయా గ్రామాల్లో వలస కార్మికులు, స్థానికేతరులు ఎక్కువ సంఖ్యలో ఓటర్లుగా ఉన్నారు. అయితే ఓటరు కార్డుకు ఆధార్ లింక్ చేసుకునేందుకు ముందుకు రాకపోవడంతో ప్రత్యేక శిబిరాలను నిర్వహిస్తున్నారు. ఆధార్ లింక్ చేయని ఓటర్లను బీఎల్‌వోలు గుర్తించి అప్పటికప్పుడే లింక్ చేశారు. ఈ కార్యక్రమాల్లో నాయబ్ తహసీల్దార్ శంకర్, ఆర్‌ఐలు రజనీకాంత్, అస్రాతోపాటు బీఎల్‌వోలు పాల్గొన్నారు.

## బీసీ రిజర్వేషన్లు పెంచాలని | కోటి సంతకాల సేకరణ

గన్నేరువరం: రాష్ట్రంలో బీసీ రిజర్వేషన్లు 27 నుంచి 52 శాతానికి పెంచాలని బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నిషాని రామచంద్రం అన్నారు. రిజర్వేషన్ల పెంపుపై శనివారం గన్నేరువరంలో చేపట్టిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బీసీ కులగణన చేపట్టాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఇటీవల రాష్ట్ర బడ్జెట్‌లో బీసీలకు కేవలం ఆరు వేల కోట్లు కేటాయించడం అన్యాయమని పేర్కొన్నారు. అలాగే భూపంపిణీపై ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ అవాస్తవాలు మాట్లాడుతున్నారని, నియోజకవర్గంలో 300 ఎకరాలు పేదలకు పంపిణీ చేయలేదని విమర్శించారు. గూడెంలో నేటికి లబ్ధిదారులకు పట్టాలు ఇవ్వలేదని, దీంతో సబ్సిడీ బోర్లు, రైతుబంధు, రైతు బీమా వంటి పథకాలకు నోచుకోవడం లేదన్నారు. కార్యక్రమంలో మానకొండూర్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు మల్లయ్య, ప్రధాన కార్యదర్శి రాజమల్లు, కోశాధికారి వెంకన్నగౌడ్, మహిళా కన్వీనర్ ప్రమీల, మండల అధ్యక్షుడు ఎల్లయ్య, భూమయ్య, రామచంద్రం, నరేష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.



బీఎస్పీ ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ

## కేంద్రం నిధులతోనే గ్రామాలు అభివృద్ధి

సైదాపూర్: కేంద్రం ఇచ్చే నిధులతోనే గ్రామ పంచాయతీల్లో అభివృద్ధి జరుగుతోందని బీజేపీ రాష్ట్ర కమిటీ సభ్యుడు కోమటిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలో ప్రజా గోస బీజేపీ భరోసా నినాదంతో స్ట్రీట్ కార్నర్ సమావేశం మండల కమిటీ అధ్యక్షుడు కందుల శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. 15వ ఆర్థిక సంఘం నిధులతో జీపీల నిర్వహణ, కేంద్రం విడుదల చేస్తున్న ఉపాధిహామీ నిధులతో సీసీరోడ్ల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయన్నారు. కేంద్రం నిధులు ఇస్తే బీఆర్‌ఎస్ నాయకులు కేసీఆర్‌కు పాలాభిషేకం చేయడం విడ్డూరంగా ఉందన్నారు. కార్యక్రమంలో బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవీందర్‌రెడ్డి, ఎంపీటీసీలుమల్లేశం, విజయ, సంతోష్, శ్రీరాంచక్రవర్తి, బీజేపీ మండల ఉపాధ్యక్షుడు సంతోష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కోమటిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి

## బీఆర్‌ఎస్ నాయకుల సంబరాలు



హుజూరాబాద్‌లో సంబరాలు జరుపుకుంటున్న బీఆర్‌ఎస్ నాయకులు

వీణవంక: ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డిని ప్రభుత్వ విప్‌గా నియమించడంతో కౌశిక్‌రెడ్డి సొంత గ్రామం వీణవంకలో బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు సంబరాలు నిర్వహించారు. ఉపసర్పంచ్ ఓరెం భానుచందర్, ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు నాగిడి సంజీవరెడ్డి, బొంతుపల్లి మాజీ ఉపసర్పంచ్ చదువు జితేందర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నేత గొట్టిముక్కుల రవీందర్‌రావు మాట్లాడారు. ప్రభుత్వ విప్ ఇవ్వడం హర్షనీయమని, కౌశిక్‌రెడ్డితోనే నియోజకవర్గం అభివృద్ధి చెందుతుందన్నారు.

హుజూరాబాద్: ప్రభుత్వ విప్‌గా శనివారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయగానే పాడి కౌశిక్‌రెడ్డి సీఎం కేసీఆర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందించి ఆశీర్వాదం తీసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ తనపై నమ్మకంతో ప్రభుత్వ విప్ పదవి అందించినందుకు మంత్రులు హరీశ్‌రావు, గంగుల కమలాకర్, కొప్పుల ఈశ్వర్, రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. పట్టణంలోని అంబేద్కర్ చౌక్ వద్ద బీఆర్‌ఎస్ నాయకులు స్వీట్లు పంపిణీ చేసి టపాసులు కాలుస్తూ సంబరాలు జరుపుకున్నారు.

జమ్మికుంట: పట్టణంలోని గాంధీ చౌరస్తా వద్ద మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపెల్లి రాజేశ్వర్‌రావు ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ శ్రేణులు సంబరాలు జరుపుకున్నారు. కౌశిక్‌రెడ్డికి ప్రభుత్వ విప్ ఇవ్వడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. నిత్యం ప్రజా సమస్యలపై స్పందిస్తూ, ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలు అందిస్తున్నారని, రాబోయే రోజుల్లో హుజూరాబాద్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తారని పేర్కొన్నారు. సీఎం కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ దేశిని స్వప్నకోటి, కౌన్సిలర్లు, యువ నాయకులు, కార్యర్తలు పాల్గొన్నారు.

## నిధుల మంజూరుపై హర్షం

చొప్పదండి: కొండగట్టు ఆలయ అభివృద్ధికి రూ. 100 కోట్లు మంజూరుపై కొండగట్టు దేవస్థానం డైరెక్టర్లు గొల్లపల్లి శ్రవణ్‌కుమార్, గన్ను శ్రీనివాస్‌రెడ్డి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్‌కు శనివారం కృతజ్ఞతలు తెలిపారు. అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా ఎమ్మెల్యేను కలిసి పుష్పగుచ్ఛం అందించారు. భక్తుల మనోభావాలకు అనుగుణంగా సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ కొండగట్టు అభివృద్ధికి గతంలో ఇచ్చిన హామీల మేరకు నిధులు మంజూరు చేసి తమ నిబద్ధత చాటుకున్నారని కొనియాడారు.

### వినోద్‌కుమార్‌ను కలిసిన నాయకులు



బొకే అందిస్తున్న మామిడి తిరుపతి

రామడుగు: కొండగట్టు పుణ్యక్షేత్రానికి ముఖ్యమంత్రి కేసీఆర్ రూ. వందకోట్లు కేటాయించడానికి కృషి చేసిన రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయిన్‌పల్లి వినోద్ కుమార్‌ను గోపాల్‌రావుపేట మార్కెట్ కమిటీ చైర్మన్ మామిడి తిరుపతి ఆధ్వర్యంలో పలువురు బీఆర్‌ఎస్ నాయకులు కలిసి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు మల్లేశం, అజయ్, సురేష్, తిరుపతి పలువురు పాల్గొన్నారు.

## 'ప్రభుత్వ వైఫల్యాలు ప్రజలకు వివరిస్తాం'



హాథ్ సేహాథ్ జోడో యాత్రలో నాగిశేఖర్, నాయకులు

గంగాధర: మండల కేంద్రంలో శనివారం హాథ్ సే హాథ్ జోడో యాత్ర నిర్వహించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలను ప్రజలకు వివరిస్తామని యువజన కాంగ్రెస్ పార్లమెంట్ మాజీ అధ్యక్షుడు నాగి శేఖర్ అన్నారు. నియోజకవర్గంలో రెండు నెలల పాటు నిర్వహించే కార్యక్రమంలో రాహుల్ గాంధీ సందేశంతో పాటు, ప్రజావ్యతిరేక విధానాలపై చార్జిషీట్ జతపరిచి ఇంటింటికి వెళ్లి వివరిస్తామన్నారు. ఏడాది రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామన్న మోదీ హామీ, సీఎం కేసీఆర్ హామీలు డబుల్ బెడ్రూం ఇళ్లు, దళితులకు మూడెకరాల భూమి, నిరుద్యోగ భృతి జాడలేవని విమర్శించారు. కార్యక్రమంలో నాయకులు పెద్దెల్లి అంజయ్య, గుంటుకు జితేందర్, పిండి శ్రీనివాస్‌రెడ్డి,పంజాల సురేష్,తాళ్ల దిలీప్, బండారి శ్రీకాంత్,రాజేశ్, అంజనేయులు,మల్లేశం,రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

## లింక్ రోడ్లకు మహర్దశ

కరీంనగర్‌రూరల్: గ్రామాల్లో లింక్ రోడ్ల నిర్మాణానికి ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోంది. ఆయా గ్రామాల్లోని లింక్‌రోడ్లను బీటీరోడ్లుగా నిర్మించేందుకు నిధులు మంజూరు చేస్తోంది. కొన్నేళ్లుగా సీతారాంపూర్ నుంచి ఆరెపల్లి, ఎలబోతారం మీదుగా ఫకీర్‌పేట వరకున్న లింక్‌రోడ్డుతో ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారు. రోడ్డంతా గుంతలేర్పడి వాహనదారులు ప్రమాదాలకు గురవుతుండగా, స్థానికులు దుమ్ముతో పడరానీపాట్లు పడ్డారు. ప్రస్తుతం ఈ రోడ్డు నిర్మాణానికి ఆర్ అండ్ బీ నిధులు రూ.1.80కోట్లు మంజూరైనాయి. ఈక్రమంలో నాలుగు రోజుల నుంచి సీతారాంపూర్ నుంచి ఆరెపల్లి రైల్వేగేటు వరకు బీటీరోడ్డు పనులు చేపట్టారు. ఇక్కడి వరకు బీటీ డబుల్‌లేయర్ వేస్తున్నారు. ఎలబోతారం నుంచి ఫకీర్‌పేట వరకు సింగిల్‌లేయర్ వేయనున్నారు. ప్రస్తుతం బీటీలేయర్ పనులు నడుస్తున్నాయని, నెలరోజుల్లోపు రోడ్డు నిర్మాణం పూర్తవుతుందని ఆర్‌అండ్‌బీ డీఈ రవీందర్, ఏఈ లక్ష్మణ్‌రావు తెలిపారు.

## కేజీబీవీలో ఇండోర్ గేమ్స్



క్యారం, చెస్ పోటీల్లో విద్యార్థినులు

చిగురుమామిడి: మండల కేంద్రంలోని కేజీబీవీలో హామ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో శనివారం బాలికలకు ఇండోర్ గేమ్స్ చెస్, క్యారం పోటీలు నిర్వహించారు. సోమవారం నుంచి నాలుగు రోజుల పాటు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్‌తో పాటు ఇతర పోటీలు నిర్వహిస్తామని సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు ధర్మపురి సాగర్ తెలిపారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు సత్యమ్మ, స్వర్ణలత, శ్రీముఖి, పెసరికుమార్, మాధవి, ఎస్‌వో రజిత తదితరులున్నారు.

## కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌పై నిరసన



గాంధీ చౌక్ వద్ద నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

జమ్మికుంట: కేంద్ర ప్రభుత్వం ప్రజావ్యతిరేక బడ్జెట్ ప్రవేశపెట్టిందని శనివారం పట్టణంలోని గాంధీ చౌక్ వద్ద సీపీఎం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ప్రజా సమస్యలను గాలికొదిలి ఓట్ల రాజకీయం చేస్తుందని రైతాంగం, పేద, బడుగు, బలహీన వర్గాలకు నిరాశే ఎదురైందన్నారు. ఆహార భద్రతకు నిధులు తగ్గించి, సంక్షేమ రంగాన్ని పూర్తిగా వదిలేసిందన్నారు. సామాజిక భద్రత, వలసలు ఆపడం కోసం యూపీఏ ప్రభుత్వం మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం తీసుకవచ్చిందని, మోదీ ప్రభుత్వం పథకాన్ని నిర్వీర్యం చేస్తుందని, సీసీఐ కొనుగోళ్లు, రైతులకు మద్దతు ధర కల్పించే చర్యలను నీరుగార్చిందని ఆరోపించారు. రైతాంగం కోసం రూ.20వేల కోట్లు సీసీఐ సంస్థకు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మహిళ సాధికారతకు బడ్జెట్‌లో నిధులు కేటాయించకపోవడం సిగ్గుచేటన్నారు. నిరసనలో జమ్మికుంట జోన్ కమిటీ కార్యదర్శి శీలం ఆశోక్, కామ్రేడ్ కొప్పుల శంకర్, జోన్ కమిటీ సభ్యులు రాములు, మొగిలి, ఓదేలు, కుమార్, రాజకుమారి, శోభన్ తదితరులు పాల్గొన్నారు.

## క్షణికావేశంలో నేరాలకు పాల్పడొద్దు




పరిష్కారమైన కేసు పత్రాలను అందిస్తున్న జడ్జీలు

హుజూరాబాద్‌రూరల్: పట్టణంలోని కోర్టు ఆవరణలో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ సివిల్ జడ్జి నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ.. రాజీమార్గంలో సమస్యలు పరిష్కరించుకోవాలన్నారు. క్షణికావేశంలో నేరాలకు పాల్పడి జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. అనంతరం 477 క్రిమినల్, 4 సివిల్, 17 బ్యాంకు కేసులను రాజీమార్గం ద్వారా పరిష్కరించామని తెలిపారు. కార్యక్రమంలో మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి అలేఖ్య, అదాలత్ సభ్యులు అరుణ్ కుమార్, అడిషనల్ పీపీ గాయత్రి, బ్యాంకు, బీఎస్ఎన్ఎల్ సిబ్బంది, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఆధ్యాత్మికం

### నేటి నుంచి మల్లికార్జునస్వామి బ్రహ్మోత్సవాలు

గంగాధర: భక్తుల పాలిట కొంగుబంగారం మండలంలోని కాచిరెడ్డిపల్లి గ్రామం కొచ్చగట్టు మల్లిఖార్జున స్వామి బ్రహ్మోత్సవాలు ఆదివారం నుంచి నాలుగు రోజుల పాటు నిర్వహించనున్నట్లు సర్పంచ్ జోగు లక్ష్మిరాజం తెలిపారు. మొదటి రోజు గంగాజల సేకరణ, పుట్టబంగారం, తదితర కార్యక్రమాలతో ఉత్సవాలు ప్రారంభిస్తామన్నారు. సోమవారం మేడలమ్మ, కేతమ్మ సమేత మల్లికార్జునస్వామి కల్యాణం, పట్నం, ఒగ్గుకథ, మూడో రోజు మంగళవారం గ్రామంలో జోగు ఎత్తడం, రాత్రి ఒగ్గుకథ, చివరిరోజు బుధవారం నాగెల్లి పట్నం, జాతర ఉంటుందని పేర్కొన్నారు. బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు తగిన సౌకర్యాలు కల్పించామని జాతర నిర్వాహకులు తెలిపారు.



గంగాధర: ముస్తాబైన దేవాలయం



జమ్మికుంట: హోమం నిర్వహిస్తున్న భక్తులు

### ఘనంగా శ్రీపంచముఖ ఆంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవాలు

జమ్మికుంట: మున్సిపల్ పరిధి మారుతీనగర్‌లోని శ్రీ పంచముఖ ఆంజనేయస్వామి ఆలయ ద్వాదశ వార్షికోత్సవాలు శనివారం ఘనంగా నిర్వహించారు. వేద పండితులు గురుస్వామి నరసింహస్వామి, సముద్రాల ప్రసాదాచార్యులు ఆధ్వర్యంలో ఉదయం అభిషేకం, బలిహరణ, హోమం, అర్చనలతోపాటు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మహా అన్నదానం కార్యక్రమం చేపట్టారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై ప్రత్యేక పూజలు, మొక్కులు చెల్లించారు. ఈకార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు పొనగంటి మల్లయ్య, ఐలయ్య, రాజేందర్‌స్వామి తదితరులు పాల్గొన్నారు.